# అక్షరశక్తి

The Power of Pen

Evening Daily

సోమవారం 24 ఆగస్టు 2026 | వరంగల్ | సంపుటి: 20 | సంచిక: 291 | పేజీలు 07




- నేనే పార్టీకి కండువా.. కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదు
- పదవుల కోసం ఏనాడూ అడగలేదు.. పార్టీ కోసం పనిచేయడమే తెలుసు
- మేయర్‌గా వరంగల్ అభివృద్ధికి రూ.178 కోట్ల నిధులు
- ఓటమి తర్వాతే ప్రజలతో బంధం మరింత బలపడింది
- మహిళా కాంగ్రెస్‌ను బలోపేతం చేసి ఎన్నికల్లో సత్తా చాటడమే లక్ష్యం
- రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, వరంగల్ మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ

రాజకీయాల్లో పదవుల కోసం పరుగులు పెట్టకుండా.. పార్టీని నమ్ముకుని పనిచేస్తే గుర్తింపు, పదవులు వాటంతట అవే వస్తాయని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, వరంగల్ మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ అన్నారు. తన రాజకీయ ప్రస్థానంలో ఎదురైన అనుభవాలను, ఒడిదుడుకులను, వరంగల్ అభివృద్ధి కోసం చేసిన కృషిని ఆమె డిజిటల్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో పంచుకున్నారు. రాజకీయాల్లోకి వస్తానని ఊహించని తాను అనూహ్యంగా పీఏసీఎస్ చైర్మన్‌గా ఎన్నికై.. ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి.. చివరకు వరంగల్ మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన తీరును వివరించారు. మేయర్‌గా ఉన్న సమయంలో నగరానికి రూ.178 కోట్ల నిధులు తీసుకొచ్చామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ.. “నాకు అన్నలు లేరు.. వైఎస్సారే నా అన్న” అంటూ భావోద్వేగానికి లోనయ్యారు. “నాకు పార్టీ కండువాలు కాదు.. నేనే పార్టీకి కండువా. రాజకీయాల్లో రిటైర్‌మెంట్ ఉండదు. ఓపిక ఉన్నంత కాలం కాంగ్రెస్ కోసం పనిచేస్తా” అని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మహిళలను పెద్దఎత్తున పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. - అక్షరశక్తి, వరంగల్



# నా అన్న వైఎస్సారే..

డిజిటల్ మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్



## వైఎస్సార్ నగర్‌లో పేదల భూమిని లాక్కునే కుట్ర!

- 2005 నుంచే గుడిసెల్లో ఉంటున్నారు
- ఇప్పుడు ఖాళీ చేయించే ప్రయత్నం
- కోర్టు వివాదం ఉన్నా.. కాంప్లెక్స్ నిర్మాణానికి ఎన్ఓసీ ఎలా ఇచ్చారు?
- దొంగ పత్రాలతో ప్రజలను తప్పుదోవ పట్టించేయత్నం
- పేదల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుంది
- మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్

4



## 129 కిలోల గంజాయి పట్టివేత

వర్ధన్నపేట వద్ద కారులో తరలిస్తుండగా నార్కోటిక్స్ పోలీసుల దాడి

ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్లు అరెస్టు

6

24-08-2026_Layout 1 25-08-2026 00:06 Page 2



- నేనే పార్టీకి కండువా.. కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదు
- పదవుల కోసం ఏనాడూ అడగలేదు.. పార్టీ కోసం పనిచేయడమే తెలుసు
- మేయర్‌గా వరంగల్ అభివృద్ధికి రూ.178 కోట్ల నిధులు
- ఓటమి తర్వాతే ప్రజలతో బంధం మరింత బలపడింది
- మహిళా కాంగ్రెస్‌ను బలోపేతం చేసి ఎన్నికల్లో సత్తా చాటడమే లక్ష్యం
- రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, వరంగల్ మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ

రాజకీయాల్లో పదవుల కోసం పరుగులు పెట్టకుండా.. పార్టీని నమ్ముకుని పనిచేస్తే గుర్తింపు, పదవులు వాటంతటవే వస్తాయని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, వరంగల్ మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ అన్నారు. తన రాజకీయ ప్రస్థానంలో ఎదురైన అనుభవాలను, ఒడిదుడుకులను, వరంగల్ అభివృద్ధి కోసం చేసిన కృషిని ఆమె డిజిటల్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో పంచుకున్నారు. రాజకీయాల్లోకి వస్తానని ఊహించని తాను అనూహ్యంగా పీఏసీఎస్ చైర్మన్‌గా ఎన్నికై.. ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి.. చివరకు వరంగల్ మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన తీరును వివరించారు. మేయర్‌గా ఉన్న సమయంలో నగరానికి రూ.178 కోట్ల నిధులు తీసుకొచ్చామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ.. "నాకు అన్నలు లేరు.. వైఎస్సారే నా అన్న" అంటూ భావోద్వేగానికి లోనయ్యారు. "నాకు పార్టీ కండువాలు కాదు.. నేనే పార్టీకి కండువా. రాజకీయాల్లో రిటైర్‌మెంట్ ఉండదు. ఓపిక ఉన్నంత కాలం కాంగ్రెస్ కోసం పనిచేస్తా" అని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మహిళలను పెద్దఎత్తున పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు.

*- అక్షరశక్తి, వరంగల్*

# నా అన్న వైఎస్సారే..

### కరీంనగర్‌లో బాల్యం.. 19 ఏళ్లకే వివాహం

కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం పాతగూడూరు తమ స్వస్థలమని స్వర్ణ తెలిపారు. తండ్రి హన్మంతరావు లాయర్‌గా ప్రాక్టీస్ చేసి, అనంతరం కాంట్రాక్టర్‌గా పనిచేశారని చెప్పారు. తల్లి జయలక్ష్మి. అక్క, చెల్లి, తమ్ముడితో కలిసి కరీంనగర్ పట్టణంలో పెరిగానన్నారు. ఇంటర్ వరకు కరీంనగర్‌లోనే చదివానని, ఇంటర్ సెకండియర్‌లో ఉండగానే వివాహం కావడంతో ఆ తర్వాత చదువును కొనసాగించలేకపోయానని గుర్తు చేసుకున్నారు. అక్క భర్త స్నేహితుడైన వరద






రాజేశ్వర్‌రావుతో పరిచయం ద్వారా వివాహ సంబంధం కుదిరిందన్నారు. రాజేశ్వర్‌రావు అప్పట్లో ఏ ఉద్యోగం చేయకపోవడంతో ఇంట్లో కొంత అభ్యంతరం వ్యక్తమైనా, ఆయన మంచివారని చెప్పి పెళ్లి చూపులు ఏర్పాటు చేశారని తెలిపారు. తన తాతకు ఆ సంబంధంపై అభ్యంతరం ఉంటే, ఆయనకంటే ముందే నువ్వే 'నో' చెప్పాలని చెప్పారని గుర్తు చేసుకున్నారు. అయితే తనకు రాజేశ్వర్‌రావు నచ్చారని, తనను కూడా ఆయనకు నచ్చడంతో వివాహం జరిగిందన్నారు.

### రాజకీయాలతో అసలు పరిచయం లేదు..

తమ కుటుంబానికి రాజకీయ నేపథ్యం లేదని స్వర్ణ తెలిపారు. ఆడవాళ్లు గడీల నుంచి బయటకు వచ్చే పరిస్థితి కూడా ఉండేది కాదని గుర్తు చేసుకున్నారు. పెళ్లి తర్వాత అత్తింట్లో తనకు ఎంతో గౌరవం లభించిందని చెప్పారు. కోడలిని కూడా కూతురిలాగే చూసుకునే సంప్రదాయం తమ అత్తింట్లో ఉందన్నారు. అత్తమామలు కులశేఖర్‌రావు, లక్ష్మీదేవి తనను సొంత బిడ్డలా చూసుకునేవారని తెలిపారు. వారి వృద్ధాప్యంలో ఎంత బిజీగా ఉన్నా సాయంత్రం వారి బాగోగులు చూసుకునేదాన్నని, మరిది, తోటి కోడలు కూడా ఎంతో మంచిగా చూసుకునేవారని గుర్తు చేసుకున్నారు. అత్తింట్లో తనకు లభించిన గౌరవమే రాజకీయంగా ముందుకు సాగే అవకాశాన్ని కూడా కల్పించిందన్నారు.

### రాజకీయ ఓనమాలు నేర్పింది మా వారే..

రాజకీయాల్లోకి రావడం మాత్రం చాలా అనూహ్యంగా, తన ప్రమేయం లేకుండానే జరిగిందని స్వర్ణ తెలిపారు. రాజకీయ ఓనమాలు నేర్పింది తన భర్త వరద రాజేశ్వర్‌రావేనని చెప్పారు. రాజకీయంగా ముందుకు రావడానికి అన్ని విధాలుగా ప్రోత్సహించింది తన మామ కులశేఖర్‌రావేనని తెలిపారు. వరద రాజేశ్వర్‌రావు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేసేవారని చెప్పారు. ఆ సమయంలో సంజయ్ గాంధీ వచ్చిన సందర్భంగా అండాల కొద్దీ పులిహోర తయారు చేశానని, దానిని రైల్వే స్టేషన్‌కు తీసుకెళ్లి ఇచ్చారని గుర్తు చేసుకున్నారు.

### అనుకోకుండా పీఏసీఎస్ చైర్మన్‌గా..

తాను రాజకీయాల్లోకి వస్తానని ఏనాడూ అనుకోలేదని స్వర్ణ చెప్పారు. వర్ధన్నపేట పీఏసీఎస్ చైర్మన్ ఎన్నికలు వచ్చినప్పుడు తన మామ పోటీ చేయాలని సూచించారని తెలిపారు. పిల్లలు చిన్నవాళ్లు కావడంతో రాజకీయాల్లోకి వస్తే ఎలా అని తొలుత అడిగానని చెప్పారు. అయితే మామ

24-08-2026_Layout 1 25-08-2026 00:06 Page 3



కులశేఖర్‌రావు, భర్త వరద రాజేశ్వర్‌రావు పట్టుబట్టి పోటీ చేయించారని తెలిపారు. ఒక్క రోజు మాత్రమే ప్రచారానికి వెళ్లినా భారీ మెజార్టీతో గెలిచానని చెప్పారు. 1991లో తొలిసారి పీఏసీఎస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టానని తెలిపారు. అనంతరం రాష్ట్రంలో టీడీపీ హవా నడుస్తున్న కాలంలో ఓడీసీఎంఎస్ డైరెక్టర్ పదవికి బరిలో నిలిపారని, ఆ ఎన్నికల్లో కూడా విజయం సాధించానన్నారు. అయితే చైర్మన్ కావాల్సిన సమయంలో సొంత పార్టీలోని వ్యక్తే హ్యాండ్ ఇవ్వడంతో ఆ పదవి చేజారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమయంలో చైర్మన్‌గా బీరం సంజీవరెడ్డి గెలిచారని తెలిపారు.

### మాది కాంగ్రెస్ కుటుంబం..

తమ కుటుంబం మొదటి నుంచి కాంగ్రెస్‌తోనే ఉందని స్వర్ణ స్పష్టం చేశారు. అన్ని పార్టీల నాయకులతో వ్యక్తిగతంగా మంచి అనుబంధాలు ఉన్నప్పటికీ రాజకీయంగా మాత్రం కాంగ్రెస్‌ను వీడలేదన్నారు. వివిధ పార్టీల నుంచి తమ కుటుంబాన్ని పార్టీలోకి రావాలని ఆహ్వానించినా వెళ్లలేదని తెలిపారు. కేసీఆర్ సైతం పార్టీలోకి రావాలని పిలిచారని, అయినా కాంగ్రెస్‌ను వీడలేదన్నారు. “ఎన్ని సమస్యలు వచ్చినా కాంగ్రెస్‌లోనే ఉన్నాం. పదవులు ఉన్నా, లేకున్నా పార్టీతో మా ప్రయాణం కొనసాగింది. జీవితం అంతా కాంగ్రెస్ పార్టీతోనే” అని స్పష్టం చేశారు.

### తొలి ఎమ్మెల్యే ఎన్నికలు..<br>10 వేల ఓట్లతో ఓటమి

1985లో వరద రాజేశ్వర్‌రావుకు ఎమ్మెల్యే టికెట్ వచ్చిందని గాంధీభవన్ నుంచి ఫోన్ వచ్చిందని స్వర్ణ గుర్తు చేసుకున్నారు. అప్పట్లో టికెట్ అంటే ఏమిటో కూడా పూర్తిగా అర్థం కాలేదన్నారు. వరద రాజేశ్వర్‌రావు అంటే అప్పటికి రాజకీయంగా పెద్దగా ఎవరికీ తెలియదని, కేవలం మాధవరావు మనుమడు అనే గుర్తింపు మాత్రమే ఉండేదన్నారు. ఆ ఎన్నికల్లో సుమారు 10 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారని తెలిపారు.

### ఓటమి తర్వాతే జనాలతో బంధం..

ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత రోజు నుంచే రాజేశ్వర్‌రావు ఉదయం 7 గంటలకు గ్రామాల్లోకి వెళ్లి ప్రజలను కలవడం ప్రారంభించారని స్వర్ణ తెలిపారు. ప్రతి ఒక్కరినీ పలకరించి, వారి కష్టసుఖాలు తెలుసుకుంటూ ప్రజలతో బలమైన అనుబంధాన్ని ఏర్పరచుకున్నారని చెప్పారు. మళ్లీ ఎన్నికలు రాగానే రాజేశ్వర్‌రావుకు టికెట్ వచ్చిందన్నారు. అయితే ఆ ఎన్నికల్లో భారీ మోసం జరిగిందని స్వర్ణ తెలిపారు. ముందుగా బీ–ఫాం ఇచ్చారని, కానీ ఎన్నికలకు ముందు రోజు మాచర్ల జగన్నాథంను అభ్యర్థిగా ప్రకటించారని చెప్పారు. రాజేశ్వర్‌రావు బీ–ఫాంతో నామినేషన్ వేయడంతో చేయి గుర్తు కూడా వచ్చిందన్నారు. పార్టీలోనే ఇద్దరు అభ్యర్థులు ఉండే పరిస్థితి రావడంతో చివరకు సుమారు 5 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారని తెలిపారు. టీ. రాజేశ్వర్ రావు గెలిచారు. ఆ ఎన్నికలతో రాజకీయంగా తీవ్ర దెబ్బ తగిలిందన్నారు.

### వైఎస్ పిలుపుతో ఎమ్మెల్యే బరిలోకి..

పదవులు ఉన్నా లేకున్నా పార్టీ కోసం పనిచేస్తున్న తమ కుటుంబాన్ని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గుర్తించారని స్వర్ణ తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్న సమయంలో ఐదు నియోజకవర్గాల సమీక్షను వర్ధన్నపేటలో ఏర్పాటు చేయాలని మా ఆయనకు ఫోన్ చేశారని చెప్పారు. డీసీసీ అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తన భర్త రాజేశ్వర్‌రావు వైఎస్‌తో కలిసి ఉన్నారని తెలిపారు. ఆ సమయంలో తనను పిలిచి వచ్చే ఎన్నికల్లో నీకు టికెట్ ఇస్తానని, నువ్వే పోటీ చేయాలని వైఎస్ చెప్పారని గుర్తు చేసుకున్నారు. అప్పటి రాజకీయ పరిస్థితుల్లో ఎవరు పోటీ చేసినా పార్టీకి నష్టం జరుగుతుందని, ఒకవేళ ఓడిపోయినా తాను చూసుకుంటానని వైఎస్ భరోసా ఇచ్చారని తెలిపారు. చెప్పినట్లుగానే టికెట్ ఇచ్చారని అన్నారు. అప్పటికే దయాకర్‌రావు బలమైన నాయకుడిగా ఉన్నప్పటికీ పోటాపోటీగా ప్రచారం చేశానని స్వర్ణ చెప్పారు. తీగరాజుపల్లిలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో భారీ బహిరంగ సభ నిర్వహించామని, ఇసుకపోస్తే రాలనంతగా ప్రజలు తరలివచ్చారని తెలిపారు. ఆ సభను ఫెయిల్ చేసేందుకు దాడులు జరిగాయని, తన కుమారులను ఇష్టారాజ్యంగా కొట్టారని ఆరోపించారు. ఎన్నికలకు రెండు రోజుల ముందు ప్రత్యర్థి అభ్యర్థి దయాకర్‌రావు చంద్రబాబుతో సమావేశం పెట్టారని, తన ఓటమి కోసం అనేక కుట్రలు జరిగాయని స్వర్ణ ఆరోపించారు. డిపాజిట్ ఓట్లు సాధించడమే కష్టమనుకున్న నియోజకవర్గంలో చివరకు కేవలం 4 వేల ఓట్ల తేడాతో ఓడిపోయానని తెలిపారు.

### మేయర్ ప్రకటన.. ఓ యుద్ధమే..

ఎమ్మెల్యే ఎన్నికల్లో ఓడిపోయినా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నారని స్వర్ణ చెప్పారు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2005లో వరంగల్ మున్సిపల్ ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో తాను కేవలం కార్పొరేటర్‌గా మాత్రమే పోటీ చేసి గెలిచానని తెలిపారు. అయితే అప్పటికే నగర రాజకీయాల్లో మేయర్ పదవిపై తీవ్ర పోటీ నెలకొందన్నారు. పోటీలో ఉన్న ఇద్దరు కీలక నేతల భార్యలు తామే మేయర్ అభ్యర్థులమంటూ అప్పట్లో ప్రచారం కూడా చేసుకున్నారని గుర్తు చేసుకున్నారు. తాను మాత్రం ఎక్కడా మేయర్ పదవి గురించి ప్రచారం చేయలేదని చెప్పారు. ఎన్నికల తర్వాత తన భర్త వరద రాజేశ్వర్‌రావుతో కలిసి వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని కలిశామని తెలిపారు. వైఎస్సార్‌తో తమ కుటుంబానికి ఉన్న సన్నిహిత అనుబంధం, ఆయన చలువతోనే తనకు మేయర్ పదవి దక్కిందన్నారు. బలమైన పోటీదారులు ఉన్నప్పటికీ వైఎస్ ఇచ్చిన మాటకు కట్టుబడి తనను మేయర్‌గా చేశారని చెప్పారు. అయితే తనను వరంగల్ మేయర్‌గా ప్రకటించిన రోజు మాత్రం మున్సిపాలిటీ వద్ద పెద్ద యుద్ధమే జరిగినంత పరిస్థితి ఏర్పడిందని స్వర్ణ గుర్తు చేసుకున్నారు.

### రూ.178 కోట్ల నిధులు..

మేయర్‌గా ఉన్న సమయంలో వరంగల్ నగర అభివృద్ధిలో తన కృషి ఎంతో ఉందని స్వర్ణ తెలిపారు. ఎవరూ ఊహించని స్థాయిలో రూ.178 కోట్ల నిధులు తీసుకొచ్చి అనేక అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. ఆ నిధులను తీసుకురావడంలో అప్పటి కేంద్ర మంత్రి దివంగత నేత జయపాల్‌రెడ్డి వంద శాతం సహకరించారని తెలిపారు. ప్రధాన జంక్షన్ల అభివృద్ధి, విస్తరణ, తాగునీటి సరఫరా, స్లమ్ ఏరియాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చామని చెప్పారు. తన హయాంలో నగర అభివృద్ధికి సంతృప్తికరంగా పని చేశామని తెలిపారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సహకారంతో మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలని సంకల్పించామని చెప్పారు. మహిళలను లక్షాధికారులను చేయాలనే లక్ష్యంతో డ్వాక్రా గ్రూపులకు వడ్డీ లేని రుణాలు అందించామని తెలిపారు.

### వర్ధన్నపేటతో ప్రత్యేక అనుబంధం

వర్ధన్నపేట నియోజకవర్గంతో తమ కుటుంబానికి ప్రత్యేకమైన అనుబంధం ఉందని స్వర్ణ తెలిపారు. ఏ కార్యకర్తకు కష్టం వచ్చినా తమ కుటుంబం అండగా ఉంటుందని చెప్పారు. ప్రజలతో, కార్యకర్తలతో మంచి సంబంధాలు కొనసాగించడమే తమ రాజకీయ బలమన్నారు.

### రేవంత్‌తో కలిసి పార్టీ విజయం కోసం..

రేవంత్‌రెడ్డి పాదయాత్ర సమయంలో వరంగల్‌లో తమ కుటుంబాన్ని కలిశారని స్వర్ణ తెలిపారు. తమది కాంగ్రెస్ కుటుంబమని, గతంలో తమకు ఉన్న గౌరవం పార్టీకి ఉంటుందని, కాంగ్రెస్‌కు ఈ ఎన్నికలు చివరి అవకాశమని, ఓడిపోతే భవిష్యత్ ఉండదని చెప్పి పార్టీ గెలుపు కోసం పనిచేయాలని కోరారని చెప్పారు. ఆయన సూచన మేరకు పార్టీ విజయం కోసం పనిచేశామని తెలిపారు. కరీంనగర్‌లో ఇన్‌చార్జిగా బాధ్యతలు ఇచ్చినా పార్టీ కోసం పని చేశానన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత కూడా తాను ఏ పదవీ అడగలేదని చెప్పారు. అయితే తన పనిని గుర్తించి 2023లో వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియమించారని తెలిపారు.

### టికెట్ రాకపోయినా నిరాశ పడలేదు..

వరంగల్ టికెట్ వస్తుందని ఆశించానని స్వర్ణ తెలిపారు. అయితే అనుకోని రాజకీయ పరిణామాల్లో కొండా సురేఖ రావడంతో ఆమెకు టికెట్ ఇచ్చారని చెప్పారు. టికెట్ రాకపోయినా తాను బాధపడలేదన్నారు. తన పార్టీ సేవలను గుర్తించి రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా బాధ్యతలు అప్పగించారని తెలిపారు. ఆ ప్రకటన వెలువడిన సమయంలో తాను ఆస్ట్రేలియాలో ఉన్నట్లు చెప్పారు.

### పదవులు ఆశించం..<br>పార్టీ కోసం పని చేస్తాం

తమది పదవులను ఆశించే కుటుంబం కాదని స్వర్ణ స్పష్టం చేశారు. పార్టీకి కట్టుబడి పనిచేస్తే పదవులు వాటంతట అవే వస్తాయని అన్నారు. ఇప్పటివరకు తాను ఏ పదవీ అడగలేదని తెలిపారు. సుమారు ఐదు దశాబ్దాలుగా పార్టీకి సేవ చేస్తున్నామని, పదవులు ఉన్నా లేకున్నా కాంగ్రెస్‌తో తమ ప్రయాణం కొనసాగుతూనే ఉందన్నారు. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇప్పటికే 20 జిల్లాల్లో పర్యటించి పార్టీ బలోపేతానికి కృషి చేశానని తెలిపారు. మహిళా సంక్షేమం, అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నామని చెప్పారు. మహిళలను పార్టీ కార్యక్రమాల్లో మరింత చురుగ్గా భాగస్వాములను చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. మండల కమిటీల ఏర్పాటు పూర్తి చేస్తున్నామని, రానున్న ఎన్నికల్లో మహిళల భాగస్వామ్యం పెంచడంతో పాటు ప్రచారంలో వారిని ముందుండేలా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. జీహెచ్ఎంసీ, జీడబ్ల్యూఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

### ‘నాకు అన్న వైఎస్సారే..<br>పార్టీకి కండువా నేనే’

తనకు అన్నలు లేరని, వైఎస్ రాజశేఖర్‌రెడ్డినే అన్నగా భావిస్తానని స్వర్ణ భావోద్వేగంగా చెప్పారు. “నాకు పార్టీ కండువాలు కాదు.. నేను పార్టీకి కండువా. రాజకీయాల్లో రిటైర్‌మెంట్ ఉండదు. ఈ సందర్భంగా డిజిటల్ మీడియా ప్రతినిధులు వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తారా అని ప్రశ్నించగా.. పార్టీ అవకాశం వస్తే తప్పకుండా బరిలో ఉంటానని చెప్పారు. నాకు ఓపిక ఉన్నంత కాలం పార్టీ కోసం పనిచేస్తా. పదవులు వాటంతట అవే వస్తాయి” అని స్పష్టం చేశారు.



24-08-2026_Layout 1 25-08-2026 00:06 Page 4







# వైఎస్సార్ నగర్‌లో పేదల భూమిని లాక్కునే కుట్ర!

- 2005 నుంచే గుడిసెల్లో ఉంటున్నారు
- ఇప్పుడు ఖాళీ చేయించే ప్రయత్నం
- కోర్టు వివాదం ఉన్నా.. కాంప్లెక్స్ నిర్మాణానికి ఎన్ఓసీ ఎలా ఇచ్చారు?
- దొంగ పత్రాలతో ప్రజలను తప్పుదోవ పట్టించేయత్నం
- పేదల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుంది
- మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్



**అక్షరశక్తి, కాజీపేట :** గ్రేటర్ వరంగల్ పరిధి కాజీపేటలోని వైఎస్ఆర్ నగర్‌లో ఎన్నో ఏళ్లుగా పేదలు గుడిసెలు వేసుకుని నివసిస్తున్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకునేందుకు కాంగ్రెస్ నాయకులు ప్రయత్నిస్తున్నారని మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, బీఆర్ఎస్ నేత దాస్యం వినయ్‌భాస్కర్ ఆరోపించారు. షాపూర్ ఇరాని కుటుంబ సభ్యులమంటూ కొందరు వచ్చి గుడిసెవాసులను ఖాళీ చేయించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. 2005 నుంచే పేదలు ఇక్కడ గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారని, వారికి ఇంటి నంబర్లు, ఆధార్, ఓటర్ కార్డులు కూడా ఉన్నాయని తెలిపారు. సోమవారం నాడు వైఎస్ఆర్ నగర్‌లో గుడిసెవాసులను దాస్యం వినయ్‌భాస్కర్ కలిసి సమస్యలను తెలుసుకున్నారు. వైఎస్సార్ నగర్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కోర్టు వివాదంలో ఉన్న భూమిపై కాంగ్రెస్ ప్రభుత్వం కాంప్లెక్స్ నిర్మాణానికి ఎన్ఓసీ ఎలా ఇచ్చిందని వినయ్‌భాస్కర్ ప్రశ్నించారు. దొంగ పత్రాలు సృష్టించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఎన్ఓసీ ఎలా ఇచ్చారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో కోట్లాది రూపాయలు చేతులు మారినట్లు అనుమానాలున్నాయని పేర్కొన్నారు. వైఎస్ఆర్ నగర్ గుడిసెవాసులను డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామంటూ భయపెడుతున్నారని దాస్యం వినయ్‌భాస్కర్ ఆరోపించారు. ప్రభుత్వ భూమిని ప్రైవేటు నిర్మాణాలకు వినియోగించడం సరికాదన్నారు. ఆ భూమిలో ప్రజా ప్రయోజనాల కోసం ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాలని సూచించారు. గుడిసెవాసులు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, వారికి అండగా బీఆర్ఎస్ పోరాడుతుందని భరోసా ఇచ్చారు. ఎన్నికల సమయంలో రైల్వే రిటైర్డ్ ఉద్యోగుల కోసం భూమి కేటాయించే విషయంలో తమపై కేసులు నమోదు చేశారని తెలిపారు. అయితే ఆ కేసులను కోర్టు కొట్టివేసిందన్నారు. ఇప్పుడు అదే భూమిపై అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఎలా వచ్చాయో అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ తమపై దౌర్జన్యం చేస్తున్నారని గుడిసెవాసులు ఫిర్యాదు చేస్తే.. ఫిర్యాదు చేసిన వారిపైనే కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. పేదల హక్కుల కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని వినయ్‌భాస్కర్ స్పష్టం చేశారు. అవసరమైతే ఈ అంశాన్ని సుప్రీంకోర్టు వరకు తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన అన్నారు. అనంతరం రైల్వే రిటైర్డ్ ఉద్యోగులతోనూ మాట్లాడి భూమికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు.

## గురుకుల బాలికలకు గుడ్‌న్యూస్!

### ఖాళీ సీట్ల భర్తీకి స్పాట్ కౌన్సెలింగ్

**అక్షరశక్తి, హనుమకొండ :** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల పరిధిలో 2026--27 విద్యా సంవత్సరానికి 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు బాలికలకు మిగిలిన ఖాళీ సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్లు జిల్లా సమన్వయ అధికారి (డీసీవో) సుధాకృష్ణ తెలిపారు. కమ్యూనిటీ, కులం తదితర నిబంధనల ప్రకారం సీట్లను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 27న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలలోపు మడికొండలోని బాలికల గురుకుల పాఠశాలలో అర్హత కలిగిన బాలికలు హాజరై దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా సీట్లు కేటాయిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హత కలిగిన బాలికలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి

**అక్షరశక్తి, హన్మకొండ :** తెలంగాణలో పనిచేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులందరినీ తక్షణమే పర్మినెంట్ చేయాలని, అప్పటివరకు కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించి అమలు చేయాలని తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు బొట్ల చక్రపాణి డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజలను అంటువ్యాధులు, అనారోగ్యాల నుంచి కాపాడుతున్న గ్రామపంచాయతీ కార్మికుల పట్ల పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్నా ఉద్యోగ భద్రత, పర్మినెంట్, కనీస వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా వంటి సంక్షేమ పథకాలు అమలు కావడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన మేరకు పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, కారోబార్, బిల్ కలెక్టర్లకు ప్రత్యేక స్టేటస్ కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. సమస్యలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు గబ్బెట యాకయ్య, జిల్లా నాయకులు బండ సాంబయ్య, శనిగారపు పురుషోత్తం, భోగం రమేష్, యాకన్న, రాజయ్య, శ్రీనివాసు, రాజు, అజయ్, కుమార్, రమ, సుశీల, కవిత, గీత, అరుణతో పాటు 100 మంది కార్మికులు పాల్గొన్నారు.





24-08-2026_Layout 1 25-08-2026 00:06 Page 5



# వివాహాల నమోదు తప్పనిసరి



**అక్షరశక్తి, నర్సంపేట :** వివాహాల తప్పనిసరి నమోదు చట్టం--2002పై అవగాహన కల్పించేందుకు నర్సంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. స్వయంకృషి సోషల్ వర్క్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ గిరిధర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా గిరిధర్ మాట్లాడుతూ వివాహ నమోదు ద్వారా వివాహానికి చట్టబద్ధత లభిస్తుందని తెలిపారు. బాల్య వివాహాలు, బహుభార్యత్వాన్ని అరికట్టడంతో పాటు ప్రేమ పేరుతో జరిగే మోసాలు, రహస్య వివాహాలు, ర-ుజువు లేని పెళ్లిళ్లను అడ్డుకోవడానికి వివాహ నమోదు పత్రం ఆధారంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. వివిధ ప్రభుత్వ పథకాలు పొందేందుకు, వితంతువులు, భర్త నుంచి విడిపోయిన లేదా దూరంగా ఉన్న మహిళలు భరణం పొందేందుకు ఈ పత్రం ఉపయోగపడుతుందని తెలిపారు. వివాహ నమోదు దరఖాస్తుతో పాటు శుభలేఖ, జనన, నివాస ధ్రువీకరణ పత్రాలు, వివాహానికి సంబంధించిన ఫొటోలు, ఇరువురి తరఫున సాక్షుల సంతకాలు జతచేయాలని సూచించారు. 'మీ వివాహానికి చట్టబద్ధత కల్పించండి.. న్యాయపరమైన ప్రయోజనాలు పొందండి' అని పిలుపునిచ్చారు. స్వయంకృషి సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్ మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా బాల్య వివాహం జరిగే అవకాశం ఉన్నట్లు తెలిసినా చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల సమాఖ్య అధ్యక్షుడు గిరగాని సుదర్శన్ గౌడ్, స్వయంకృషి సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్, ప్రతిభ సంస్థ ప్రతినిధి బోయిని వెంకటస్వామి, సోషల్ వాలంటీర్ కాసుల వెంకటాచారి, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్లు పున్నం చందర్, హబీబ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్ఎస్ఎస్‌తో వర్సిటీ ప్రతిష్ఠ పెంచాలి

**అక్షరశక్తి, కేయూ క్యాంపస్ :** జాతీయ సేవా పథకం (ఎన్ఎస్-ఎస్) కార్యక్రమాల ద్వారా కాకతీయ విశ్వవిద్యాలయ ప్రతిష్ఠను మరింత పెంచాలని వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం విశ్వవిద్యాలయ సెనెట్ హాల్‌లో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ అధ్యక్షతన ఉమ్మడి వరంగల్ జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ల సమావేశం జరిగింది.




ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం--2020 అకడమిక్ అంశాలతో పాటు విలువలు, నైపుణ్యాలు, సామాజిక బాధ్యతలకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. 'వికసిత్ భారత్--2047', 'రైజింగ్ తెలంగాణ' లక్ష్యాలకు అనుగుణంగా ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలను రూపొందించి యువతను సామాజిక అభివృద్ధిలో చురుకైన భాగస్వాములను చేయాలని సూచించారు. స్టూడెంట్ అఫైర్స్ డీన్ ఆచార్య మామిడాల ఇస్తారి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సభ్యత్వం, 'మై భారత్' పోర్టల్‌లో నమోదుపై అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల్లో కాకతీయ విశ్వవిద్యాలయం ఇతర విద్యాసంస్థలకు మార్గదర్శకంగా నిలవాలని ఆకాంక్షించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ వాలంటీర్ శ్రీజా జాతీయ స్థాయి యువ పార్లమెంట్‌లో ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. గత ఏడాది మేడారం జాతరలో వాలంటీర్లు పాల్గొన్నారని, 170 ప్రత్యేక ఎన్ఎస్ఎస్ శిబిరాలు నిర్వహించినట్లు చెప్పారు. యువ పార్లమెంట్ కార్యక్రమాల ద్వారా విద్యార్థులను రాష్ట్ర, జాతీయ స్థాయికి ప్రోత్సహించినట్లు తెలిపారు. సెప్టెంబర్‌లో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా ఎన్ఎస్ఎస్ కన్వీనర్ డా. ఎం. రాంబాబు, జనగామ జిల్లా కన్వీనర్ డా. వి. శ్రీనివాస్, మహబూబాబాద్ జిల్లా కన్వీనర్ ఎం. అనిల్‌కుమార్, ములుగు జిల్లా కన్వీనర్ సీహెచ్. ప్రసన్నకుమార్, భూపాలపల్లి జిల్లా కన్వీనర్ ఎం. యుగేందర్, క్యాంపస్ కళాశాల ప్రోగ్రాం ఆఫీసర్ డా. టి. రాధిక, న్యాయ కళాశాల ప్రోగ్రాం ఆఫీసర్ డా. వై. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.




# దళితుల భూమిని తిరిగి కేటాయించాలి

**అక్షరశక్తి, హసన్‌పర్తి:** దళితులకు చెందాల్సిన ప్రభుత్వ భూమిని ఇతరులకు కేటాయించడంపై విచారణ జరిపి, ఆ భూమిని అర్హులైన దళితులకు కేటాయించాలని సామాజిక ఉద్యమకారుడు రేణుకుంట్ల దుర్గాప్రసాద్ మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు హసన్‌పర్తి ప్రజావాణిలో దరఖాస్తు సమర్పించారు. ఎల్లాపూర్ గ్రామంలోని సర్వే నంబర్ 246/2/3లో 5 ఎకరాల 8 గుంటల 1/2 నర భూమి ఉందని, అందులో కొంత భూమిని రెడ్డి కులానికి చెందిన గంగిళ్ల తిరుపతిరెడ్డి, అంజిరెడ్డికి కేటాయించినట్లు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ భూముల కేటాయింపులో నిబంధనలు, జీవో మార్గదర్శకాలను అధికారులు పాటించలేదని ఆరోపించారు. నిరుపేదలైన దళితులకు భూమి కేటాయించి జీవనోపాధికి అవకాశం కల్పించాలని కోరారు. ప్రభుత్వ భూమిని పేదలకు కేటాయించడం సాధ్యం కాకపోతే గ్రామ అవసరాలకు, ప్రభుత్వ కార్యాలయాల కోసం వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు స్పందించకపోతే ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

# ఎంపీడీవోగా టీవీఎల్ఎన్ శాస్త్రి

## గూడూరు మండలంలో బాధ్యతల స్వీకరణ

**అక్షరశక్తి, గూడూరు:** మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా టీవీఎల్ఎన్ శాస్త్రి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గత కొంతకాలంగా ఎంపీవో ఏ. సత్యనారాయణ ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు నిర్వహించారు. నూతన ఎంపీడీవో శాస్త్రిని కార్యాలయ సిబ్బంది శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాస్త్రి మాట్లాడుతూ మండల పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటానన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు.



# పోలీసు అధికారుల సంక్షేమానికి ప్రాధాన్యం

**అక్షరశక్తి, భూపాలపల్లి :** పోలీసు ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేయగా ఎస్పీ నూతన కార్యవర్గ సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమానికి నూతన కార్యవర్గం ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, పోలీసు శాఖలో ఐక్యత, పరస్పర సహకారం, సమన్వయాన్ని మరింత బలోపేతం చేస్తూ సమర్థవంతంగా పనిచేయాలని అన్నారు. అసోసియేషన్ చేపట్టే



సంక్షేమ కార్యక్రమాలకు జిల్లా పోలీసు శాఖ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

**నూతన కార్యవర్గం:** అధ్యక్షుడు గూగులోతు నరేష్ (ఎస్‌బీ కానిస్టేబుల్, భూపాలపల్లి); ఉపాధ్యక్షులు ఎన్. వెంకటేశ్వర్లు (ఇన్‌స్పెక్టర్, మహాదేవపూర్), ఎస్. సాంబమూర్తి (ఎస్ఐ, మహాదేవపూర్); కార్యదర్శి బి. అశోక్ (ఎస్ఐ, ఘనపూర్); జాయింట్ సెక్రటరీ ఎ. రమేష్ (పీసీ, మహాముత్తారం పోలీస్ స్టేషన్); ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏ. సతీష్ (పీసీ, ఘనపూర్ పోలీస్ స్టేషన్); కోశాధికారి ఓ. చిన్నన్న (కానిస్టేబుల్, పీసీఆర్, భూపాలపల్లి). కార్యవర్గ సభ్యులుగా బి. సతీష్ (భూపాలపల్లి పోలీస్ స్టేషన్), డి. శ్రావణ్ (పీసీ, పలిమెల పోలీస్ స్టేషన్), పి. విజయ్ (పీసీ, మొగుళ్లపల్లి), ఎం. అంబిక (పీసీ, మహాముత్తారం పోలీస్ స్టేషన్), ఎం. యాదిరెడ్డి (ఏఆర్ హెడ్ కానిస్టేబుల్, భూపాలపల్లి), క్రాంతి (ఏఆర్ పీసీ, భూపాలపల్లి) ఉన్నారు.

24-08-2026_Layout 1 25-08-2026 00:06 Page 6



# మహాధర్నాకు ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరు కావాలి



**అక్షరశక్తి,భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి కలెక్టరేట్‌లో ఆగస్టు 27న నిర్వహించనున్న మహాధర్నాకు ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని టీజీఈజేఏసీ జిల్లా చైర్మన్ బూరుగు రవికుమార్, కన్వీనర్ విజయలక్ష్మి పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడుతూ, అన్ని భాగస్వామ్య సంఘాలు, యూనియన్ల ఉద్యోగులు తమ సంఘాల బ్యాడ్జీలు ధరించి, నల్ల రిబ్బన్లు కట్టుకుని మహాధర్నాలో పాల్గొనాలని కోరారు. ఆగస్టు 27 నుంచి కార్యాలయాలకు విధులకు హాజరయ్యే సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించాలని సూచించారు. సెప్టెంబర్ 1న నిర్వహించే పెన్షన్ విద్రోహ దినం కార్యక్రమంలోనూ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన తెలపాలని కోరారు. అదేవిధంగా సెప్టెంబర్ 10న నిర్వహించనున్న 'మహాధర్నా--చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు టీజీఈజేఏసీ భాగస్వామ్య సంఘాలు, యూనియన్లు అధిక సంఖ్యలో పాల్గొనాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అశోక్ కుమార్‌కు నిరసన కార్యక్రమాల పత్రాన్ని, జిల్లా ఎస్పీకి సమాచార నిమిత్తం వినతిపత్రాన్ని అందజేశారు. సమావేశంలో పీఆర్టీయూటీఎస్ అధ్యక్షుడు ఆర్. సుభాకర్ రెడ్డి, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి ఏ. దశరథరామారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షఫీ సర్కార్, డీటీఎఫ్ అధ్యక్షుడు చి. అశోక్, టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్షుడు ఎన్. తిరుపతి, కార్యదర్శి కె. కుమారస్వామి, ట్రెస్సా అసోసియేట్ అధ్యక్షుడు ఎస్‌కే. అబ్బాస, టీపీటీఎఫ్ అధ్యక్షుడు బి. సేవానాయక్, ఎస్టీయూటీఎస్ కార్యదర్శి ఎల్. రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# వృద్ధుడికి నిత్యావసరాల పంపిణీ

**అక్షరశక్తి, వరంగల్ :** ఆరోగ్య సమస్యలతో పాటు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వరంగల్ ఫోర్ట్ రోడ్‌కు చెందిన వృద్ధుడు నల్లకుంట చంద్రశేఖర్‌కు సనాతన హిందూ సేవా సమితి ఆధ్వర్యంలో రెండు నెలలకు సరిపడా బియ్యం, నిత్యావసర సరుకులను అందించారు. సమితి 227వ సేవా కార్యక్రమంలో భాగంగా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రూప్ వ్యవస్థాపకుడు తాళ్లపల్లి నగేష్, అధ్యక్షుడు మిట్టపెల్లి వేణు, గ్రూప్ సభ్యులు నోముల మహేష్, గంగిడి ధర్మారెడ్డి, బడుగు రాము, బండారి సంపత్, మిరిపెల్లి వినయ్, బేతి వేణు పాల్గొన్నారు.



# పింగిలి మహిళా కళాశాలకు పరిశోధన కేంద్రం హోదా

## ఇద్దరు అధ్యాపకులకు రీసెర్చ్ సూపర్‌వైజర్లుగా గుర్తింపు

**అక్షరశక్తి, కేయూక్యాంపస్ :** వరంగల్ నగరంలోని వడ్డేపల్లిలో ఉన్న పింగిలి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు పరిశోధన కేంద్రం హోదా లభించింది. కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పింగిలి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలల్లోని మైక్రోబయాలజీ విభాగాల అసోసియేట్ ప్రొఫెసర్లు డా. జి. రేణుక, డా. పి. పల్లవిలను పరిశోధన పర్యవేక్షకులుగా గుర్తించారు. ఈ నిర్ణయంతో ఆయా కళాశాలల్లో పరిశోధన కార్యకలాపాలకు మరింత ప్రోత్సాహం లభించడంతో పాటు విద్యార్థులకు ఉన్నత విద్య, పరిశోధన రంగాల్లో మెరుగైన అవకాశాలు అందుబాటులోకి రానున్నాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య శ్రీనివాస్, పింగిలి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య చంద్ర మౌళిని విశ్వవిద్యాలయ అధికారులు అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ ఆచార్య బి. వెంకటరాం రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల, దూరవిద్య కేంద్ర సంచాలకుడు ఆచార్య బి. సురేష్‌లాల్, మైక్రోబయాలజీ విభాగాధిపతి ఈ. సుజాత, డా. జి. సుహాసిని, డా. కే. రజనీలత తదితరులు పాల్గొన్నారు.



# మధ్యాహ్న భోజనంలో నాణ్యత ఉండాలి

**అక్షరశక్తి,వరంగల్ :** విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన, పరిశుభ్రమైన మధ్యాహ్న భోజనం అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. సోమవారం కలెక్టర్ మట్టేవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం నాణ్యత, రుచి, పరిశుభ్రతతో పాటు వంటశాల నిర్వహణ, భోజనం తయారీ, వడ్డింపు విధానాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వంటశాల, భోజన తయారీ, వడ్డింపు ప్రక్రియలో పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో ఎలాంటి నాణ్యతా లోపాలు తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

# తెలంగాణ పారా త్రోబాల్ జట్లకు ఘన విజయం



**అక్షరశక్తి, హనుమకొండ:** తమిళనాడులోని కోయంబత్తూర్‌లో ఆగస్టు 21 నుంచి 23 వరకు నిర్వహించిన 5వ సౌత్ జోన్ పారా త్రోబాల్ ఛాంపియన్‌షిప్--2026లో తెలంగాణ పారా త్రోబాల్ జట్లు అద్భుత ప్రతిభ కనబరిచాయి. మహిళల జట్టు ఛాంపియన్‌గా నిలిచి స్వర్ణ పతకాన్ని సాధించగా, పురుషుల జట్టు రన్నర్స్‌అప్‌గా నిలిచి రజత పతకాన్ని కైవసం చేసుకుంది. మహిళల జట్టుకు మచర్ల కృష్ణవేణి కెప్టెన్‌గా వ్యవహరించగా, పురుషుల జట్టుకు జి. ప్రశాంత్ కెప్టెన్‌గా వ్యవహరించారు. జట్లకు కోచ్‌గా సింగారపు బాబు, మేనేజర్‌గా తాళ్ల శ్రీనివాస్ రెడ్డి వ్యవహరించారు. ఈ విజయంతో తెలంగాణ పారా క్రీడాకారులు తమ ప్రతిభను మరోసారి చాటిచెప్పారని, రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారని క్రీడాభిమానులు అభినందనలు తెలిపారు. మహిళల జట్టు ఛాంపియన్‌గా, పురుషుల జట్టు రన్నర్స్‌అప్‌గా నిలవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# అపరాజిత ప్రీతికి డాక్టరేట్



**అక్షరశక్తి, కేయూ క్యాంపస్ :** కాకతీయ విశ్వవిద్యాలయ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగ పరిశోధకురాలు అపరాజిత ప్రీతికి డాక్టరేట్ లభించింది. విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల ఈ విషయాన్ని ప్రకటించారు. 'ఎమోషనల్ ఇంటెలిజెన్స్ అండ్ వర్క్ పెర్ఫార్మన్స్ ఆఫ్ ఎంప్లాయిస్ -- ఎ స్టడీ ఆఫ్ విమెన్ ఎంప్లాయిస్ ఇన్ సెలెక్ట్ బ్యాంక్స్' అంశంపై విభాగ ఆచార్యులు ఆచార్య పి. అమరావేణి పర్యవేక్షణలో అపరాజిత ప్రీతి పరిశోధన పూర్తి చేశారు. భూపాలపల్లికి చెందిన అపరాజిత ప్రీతిని బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

24-08-2026_Layout 1 25-08-2026 00:06 Page 7



# వన మహోత్సవ లక్ష్యాలను పూర్తి చేయాలి

**రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**

**అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి సమీక్ష**





**అక్షరశక్తి, హైదరాబాద్:** వన మహోత్సవంలో భాగంగా జిల్లాలకు నిర్దేశించిన మొక్కల నాటే లక్ష్యాలను సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేసేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.సోమవారం వన మహోత్సవం కార్యక్రమంపై మంత్రి కొండా సురేఖ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించగా, హనుమకొండ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి హాజరయ్యారు.
ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ... ప్రస్తుత సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా 16.06 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించగా, ఇప్పటివరకు 9.06 కోట్ల మొక్కలు నాటినట్లు తెలిపారు. రేపు వన మహోత్సవంలో భాగంగా అన్ని జిల్లాల్లో భారీ స్థాయిలో సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహించి, ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని సూచించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలు, రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ అనుకూల వాతావరణాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకొని పెద్ద సంఖ్యలో మొక్కలు నాటాలని మంత్రి సూచించారు. ప్రతి మండలం, గ్రామం, పట్టణ ప్రాంతానికి స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించి రేపటి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు.
అంగన్‌వాడీ టీచర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు, యువత, ప్రజాప్రతినిధులను పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని మంత్రి సూచించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులను ఆహ్వానించి కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని మంత్రి తెలిపారు. ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేయాలని, మొక్కల మనుగడను ప్రతిరోజూ పర్యవేక్షించాలని, చనిపోయిన వాటి స్థానంలో వెంటనే కొత్త మొక్కలను నాటాలని ఆదేశించారు. నాణ్యమైన మొక్కలను మాత్రమే నాటాలని, అవసరమైనవి సకాలంలో తరలించాలని సూచించారు.
అటవీ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న భూములను గుర్తించి మొక్కలు నాటాలని, పట్టణ ప్రాంతాల్లో అర్బన్ ఫారెస్ట్రీని ప్రోత్సహించాలని అన్నారు. దేవాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రభుత్వ సంస్థల ప్రాంగణాల్లో కూడా ప్రణాళికాబద్ధంగా మొక్కలు నాటాలని సూచించారు. బ్లాక్ ప్లాంటేషన్ ప్రాంతాల్లో నీటి సౌకర్యం కల్పించాలని, వన మహోత్సవ కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించి మీడియాను కూడా భాగస్వామ్యం చేయాలని మంత్రి ఆదేశించారు.
ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ..
వన మహోత్సవం కింద జిల్లాలో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. నిర్దేశిత మొక్కలు నాటి లక్ష్యం చేరుకునే విధంగా కృషి చేస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు,స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, ప్రజల భాగస్వామ్యంతో జిల్లాలో వన మహోత్సవ లక్ష్యాన్ని చేరేవిధంగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

---




# 129 కిలోల గంజాయి పట్టివేత

**వర్ధన్నపేట వద్ద కారులో తరలిస్తుండగా నార్కోటిక్స్ పోలీసుల దాడి**

**ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్లు అరెస్టు**

**అక్షరశక్తి,వరంగల్:** వరంగల్ జిల్లాలో భారీగా గంజాయి పట్టుబడింది. వర్ధన్నపేట సమీపంలో కారులో అక్రమంగా తరలిస్తున్న 129 కిలోల గంజాయిని నార్కోటిక్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.65 లక్షలు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు నార్కోటిక్స్ పోలీసులు వర్ధన్నపేట వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వెళ్తున్న కారును తనిఖీ చేయగా భారీగా గంజాయి పట్టుబడింది. గంజాయిని అక్రమంగా తరలిస్తున్న కేరళకు చెందిన అంతర్రాష్ట్ర స్మగ్లర్లు సాయుజ్, మాథ్యూలను పోలీసులు అరెస్టు చేశారు.
పోలీసుల విచారణలో నిందితులు ఒడిశాలో గంజాయిని కొనుగోలు చేసి, బెంగళూరు మీదుగా కేరళకు తరలిస్తున్నట్లు వెల్లడైనట్లు అధికారులు తెలిపారు. ఈ అక్రమ రవాణా వెనుక ప్రధాన సూత్రధారులుగా ఉన్న అజిత్, విక్కీ ప్రస్తుతం పరారీలో ఉన్నారని, వారి కోసం ప్రత్యేక బృందాలతో ముమ్మరంగా గాలిస్తున్నామని పోలీసులు వెల్లడించారు. నిందితుల నుంచి గంజాయితో పాటు ఒక కారు, రెండు మొబైల్ ఫోన్లు, నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ గంజాయి రవాణా వెనుక ఉన్న నెట్‌వర్క్‌పై దర్యాప్తు కొనసాగుతోందని నార్కోటిక్స్ పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పేర్కొన్నారు.




# అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు..

**రూ.12 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం**

**అక్షరశక్తి, హనుమకొండ క్రైమ్:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను మిల్స్ కాలనీ పోలీసులు, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా సోమవారం అరెస్టు చేశారు. నిందితుడి నుంచి సుమారు రూ.12 లక్షల విలువైన 70.19 గ్రాముల బంగారు ఆభరణాలు, 527.9 గ్రాముల వెండి, రూ.29,875 నగదు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత, ఐపీఎస్ ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందాలు సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా దర్యాప్తు చేపట్టాయి. పెద్దపల్లికి చెందిన ఆశిష్ శ్రీనివాస్ రెడ్డిమల్ల (27) ప్రస్తుతం మహారాష్ట్రలోని చంద్రపూర్‌లో నివాసం ఉంటున్నాడు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో తాళం వేసి ఉన్న ఇళ్లను పగటిపూట గుర్తించి, రాత్రి వేళల్లో చోరీలకు పాల్పడేవాడని పోలీసుల విచారణలో వెల్లడైంది. 2024, 2025 సంవత్సరాల్లో మహారాష్ట్రలో నాలుగు చోరీలకు పాల్పడిన నిందితుడిని అక్కడి పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించగా, బెయిల్‌పై విడుదలయ్యాడు. అయినప్పటికీ తన పద్ధతి మార్చుకోకుండా ఈ ఏడాది మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని శివనగర్, ఎస్ఆర్ఆర్ నగర్ ప్రాంతాల్లో తాళం వేసి ఉన్న ఇళ్లలో వరుస చోరీలకు పాల్పడినట్లు విచారణలో తేలింది. వరంగల్ రైల్వే స్టేషన్‌లో నిందితుడిని అదుపులోకి తీసుకున్న మిల్స్ కాలనీ పోలీసులు చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని విచారించారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, మిల్స్ కాలనీ ఇన్‌స్పెక్టర్ స్వామి, ఎస్ఐ మహేష్, ఏఏఓ సల్మాన్ పాషా, సీసీఎస్, మిల్స్ కాలనీ పోలీస్ సిబ్బందిని వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత అభినందించారు. ఈ వివరాలను సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత వెల్లడించారు.




Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.